# ఎందరో శ్రీరాముళ్లు ! అందరికీ జోహార్లు !

టేబిల్ మీదున్న ఆఫీసార్డర్ని చూసి శ్రీరాములు నిట్టూర్చాడు. సుబ్బారావు, మూర్తీ, అబ్బాస్ అందరూ శ్రీరాముల్ని కాఫీ తెప్పించమని అడుగుతున్నారు. 'అలాగే' అని అటెండర్ని పిలిచి నాలుగు కాఫీలకోసం చెప్పాడు. అతని సీనియర్లూ, అతని జూనియర్లూ కంగ్రాచ్యులేషన్స్ చెబుతూ వుంటే థాంక్స్ చెబుతున్నా, ఎదుటి సీటు చూడగానే ఏదో బాధ కలుగుతోందతనికి! నీరద నవ్వుతూ 'థాంక్స్' చెబుతోంది అందరికీ! అక్కడా రెడ్డీ, దీక్షితులూ, సుబ్రహ్మణ్యం నీరదని కాఫీ తెప్పించమని అడిగారు. కబుర్లు చెప్పుకుంటూ నవ్వుతూ కాఫీ తాగుతూన్న వాళ్లని చూస్తే శ్రీరాములుకి బాధగా వుంది.

ఇంతకీ శ్రీరాముల బాధల్లా తనతోపాటు నీరదకీ ప్రమోషనొచ్చింది. అదీ తన దృష్టిలో నీరద పనికిరాని పిల్ల! ఆడది! తన శక్తి సామర్థ్యాల ముందూ, తన తెలివితేటల ముందూ ఆమెంత? అటువంటిది తనకీ ఆమెకీ కలిపి ఒకే ఆఫీసార్డరులో ప్రమోషన్లు రావడం బాధగా వుంది శ్రీరాములుకి!

అతని దృష్టిలో ఆడదంటే ఆజ్ఞలు పుచ్చుకోవలసిన వ్యక్తేకాని ఆజ్ఞలు ఇచ్చే వ్యక్తి కాదు. ఇంట్లో భార్య రమ్మంటే రావడం, పొమ్మంటే పోవడం, పిల్లల్ని కనడం, పెంచడం, ఇంటెడు చాకిరి చేస్తూ మొగుడికి పిల్లలకీ వండిపెట్టడం! అందుకు తప్ప ఏ విషయాల్లోనూ, సలహా సంప్రదింపులలోనూ జోక్యం చేసుకోకూడదు. పొరబాటున ఏదైనా చెప్పబోతే 'ఆడదానివి నీకేం తెలుసు ఈ వ్యవహారాలన్నీ' అని తీసిపారేసేవాడు. అతని దృష్టిలో ఆడది 'నెంబర్ టూ మనిషి! మగవాడితో సమానంగా ఆలోచించే అర్హతలేని మనిషి.'

అటువంటిది ఆఫీసులో తనకి పక్కలోబల్లెం నీరద! ప్రతీ విషయంలోనూ పై ఆఫీసర్లు ఏవైనా మీటింగులు పెడితే శ్రీరాములితో పాటు నీరదనీ పిలవడం, ఆమె సలహాలనూ ఆమోదించడం భరించలేనిదిగా వున్నా ఇంట్లో

అంటే దబాయిస్తాడుగానీ ఆఫీసులో ఏంచేస్తాడు?

పైగా పాతకాలంలోలా ఒక్క టీచర్ ఉద్యోగానికే ఆడవాళ్లు పరిమితం కాకుండా ఇంజనీరింగ్, పోలీస్ ఉద్యోగాల్లో కూడా అంటే ఏవైతే కేవలం మగవాళ్లు తప్ప ఆడవాళ్లు అనర్హులు అనుకున్న ఉద్యోగాల్లో కూడా ఆడవాళ్లు రావడం, రాణించడం చూస్తూ కూడా ఒక సూపరింటెండెంట్ ఉద్యోగంలో నీరద పనికిరాదని ఎల్లా చెప్పగలడు? అందుకనే "ఆ . . . ఆమెదేముంది? ఆడదికదా! పై వాళ్ళ దగ్గరికెళ్ళి నాలుగు చిరునవ్వులు పారేసుంటుందీ. దాంతో వాళ్ళు అయిసయిపోయి ఆమె పేరునీ ఓకే చేసేశారు." అనేవాడు. ఇంకా పట్టలేకపోతే "ఆమెకేమిటండీ? చచ్చేంత ఇన్‌ఫ్లుయన్స్ వుంది. చూడండీ అదున్నాక పనొచ్చా రాదా అని ఎవరు చూస్తారూ?" అనేవాడు నీరద వినేలాగా!

నీరదకి తెలుసు ఆ మాటలు తను వినాలని బాధపడాలని అంటున్నాడని. అందుకే అసలు విననట్టుగా తన పని తను చేసుకుపోయేది. తనకి మంచి కాంప్లిమెంటొస్తే పైవాళ్ళ దగ్గరినుంచి అది తన ప్రతాపంగా చెప్పుకునేవాడు. నీరదని ఎవరైనా పొగిడితే ఆడామగా సంబంధాలను గుర్తుతెచ్చి 'బుట్టలో వేసుకునుంటుంది' అనేవాడు. ఎంత నిగ్రహంగా అతని మాటలు పట్టించుకోకూడదని అనుకున్నా అప్పుడప్పుడు శూలాల్లా గుండెని తాకేవి ఈ మాటలు! తనలోతనే కాస్సేపు బాధపడేది!

చరిత్రలో ఒక రుద్రమదేవి, ఒక ఇందిరాగాంధీ, ఒక దుర్గాబాయమ్మల గురించి గొప్పగా చెప్పుకుంటున్నా మధ్యతరగతి నారీమణుల సంగతేమిటి. ఇలాంటి ఎత్తిపొడుపులూ, దెప్పుళ్లూ తప్పవే! దీనికితోడు ఆమె వివాహిత అయితే భర్త మంచివాడు. అర్థం చేసుకునేవాడూ అయితే ఫరవాలేదుకానీ అనుమానం మనిషి, ఆవేశపరుడూ అయితే పర్యవసానం ఏమిటి? అవివాహిత అయితే ఈ బురదజల్లుని కడుక్కోవడం ఎలా? ఎప్పుడూ నీరదని వెంటాడే ప్రశ్నలే ఇవి!

దేశంలో కులమతాల అస్తవ్యస్తాల గురించి అసమానతలను గురించి, నొక్కి వక్కాణించే పెద్దమనుషులు. ఇంకా స్త్రీ పురుషుల అసమానతలనే తొలగించలేక పోతున్నారూ అంటే ఆడవాళ్ళలో వెనుకబడి వుండే స్వభావం

కారణమా? లేక మగాళ్లు ఆడదాన్ని అణచిపెట్టేసి అవకాశాలివ్వకుండా తన ఆధిపత్యాన్ని నిరూపించుకోవాలనుకునే గుణమా? కారణాలు ఏమిటి? అని ప్రశ్నించుకునేది నీరద. తనకు తానే సమాధానం చెప్పుకుంది.

ఆడవాళ్లు తమంతట తాము ముందుకెళ్లి వాళ్ల హక్కుల గురించి, వారి సముచిత స్థానాన్ని గురించి వాళ్లే తెలుసుకోవాలి! మేమే మాత్రమూ మగవాళ్ళకి తీసిపోమని ఋజువు చెయ్యాలి! రాజకీయాల్లోనైనా, ఉద్యోగాల్లోనైనా చివరికి గృహవ్యవస్థలోనైనా, మేమూ పురుషులలా ఆలోచించగలం! అనుకున్నది అమలుపరచి ఆచరణలో పెట్టగలం అని నిరూపించాలి. సమాధానం దొరికిన నీరద శ్రీరాములు మాటల్ని లెక్కచెయ్యదు.

బస్సులో అతను కూర్చుని తను నుంచుని వస్తూంటే సమానత్వం కావాలిగా ఆడవాళ్ళకి మనం లేచి నుంచుని వాళ్ళకి సీటివ్వడం అనవసరం అని శ్రీరాములిచ్చే ఉపన్యాసం విని నవ్వుకుంటుంది. పసిపిల్లలూ, ముసలివారూ అలాగే స్త్రీలు శారీరకంగా కొంత అర్భకులు పురుషుల ముందు వారిని కూర్చోమనడం వారిని గౌరవించడమౌతుంది కానీ తమని తాము కించపరచుకోవడంకాదు! కానీ శ్రీరాముల్లాంటి వారికి ఎలా చెప్పడం? చెప్పినా వారి మెదడుకెక్కదు! అందుకే నీరద తాననుకున్నది ఆచరణలో పెట్టి చూపించడం తప్ప మాట్లాడదు. అందుకే నిర్మలమైన మనస్సుతో ప్రమోషన్ ఆర్డరు చూసి కాఫీ తెప్పించింది. నవ్వుతూ మాట్లాడుతూ కాఫీ తాగింది. పాపం శ్రీరాములు నవ్వలేక తాగలేక సతమతమయి పోతున్నాడు. తలెత్తి చూసి నీరద నవ్వుతూ వుంటే ఉలిక్కిపడి కాఫీకప్పు కింద పడేశాడు శ్రీరాములు!

*